
# సినీ బేతాళ కథలు





– డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 33 -

### - శ్రీకృష్ణలీలలు -

**విక్రమార్కుడు** తన భుజం మీద బేతాళుడి శవాన్ని వేసుకుని మళ్లీ నడకసాగించాడు.

"విక్రా! మార్గమధ్యంలో నువ్వు శ్రమ మరచిపోడానికి మరో కథ చెబుతాను విను!" - అని బేతాళుడు చెప్పడం ప్రారంభించాడు -

'ఆ మధ్య బాబోయ్ భాయిశాస్త్రి అనే నిర్మాత దర్శకుడుండేవాడు. అతను అన్నీ ట్రిక్కులున్న సినిమాలే తీసేవాడు. ఆ రోజుల్లో కెమెరా ట్రిక్కులు, గ్రాఫిక్కులు అంతగా అంటే యింతగా పరిణితి చెందలేదు. అయినా అన్ని అవస్థలూ పడి అల్టిమేట్ చిత్రాలు తీసేవాడు.

బాబోయ్‌శాస్త్రి చిత్రం 'కృష్ణలీలలు' చూసి ప్రేక్షకులు బాబోయ్! తెలుగు సినిమా యింత గొప్పగా తియ్యొచ్చా అని అచ్చెరువొంది అమితంగా ఆదరించారు. 'కృష్ణలీలలు' సినిమాలో శ్రీకృష్ణుడు తన వేలు మీద గోవర్ధన గిరిని పైకెత్తి గోజనావళికి కొండంత అండగా నిలవడం అందరి ప్రేక్షకులనూ ఆకట్టుకున్న సన్నివేశం.

అనూహ్యమైన కలెక్షన్స్‌తో విజయం సాధించి 'కృష్ణలీలలు' చిత్రం వందరోజుల పండుగ చేసుకుంది. ఆ చిత్రంలో పనిచేసిన నటీనటులు టెక్నీషియన్లు అంతా స్టేజ్‌మీది వారంతా పరస్పర డబ్బా వాయిస్తూ వొకర్నొకరు పొగుడుకున్నారు. జనమంతా స్పందన వందనాల చప్పట్లు కొట్టారు.

ఫంక్షన్ కొంత సాగాక కాస్త లేటుగా కంగారుగా నడుస్తూ వొక వ్యక్తి వేదికమీదికి వచ్చి లైనులో నిలబడ్డాడు. అతని పేరు బాహుబలి ఖన్నా - కృష్ణలీలు చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. బాహుబలిఖన్నా బలంగా దారుఢ్యంగా వుంటాడు. అవాళ పైజమా, లాల్చీ వేసుకున్నాడు. లైట్ల కాంతిలో పైజమాలోంచి అతని కాళ్లు దూలాల్లా అగుపిస్తున్నాయి. అతను వేసుకున్న లాల్చీ కాస్త పొడుగ్గా వుండడంవల్లో ఏమో అతని చేతులు కనిపించడంలేదు.

'క్షమించాలి. కాస్త లేటయింది - అంటూ బాహుబలి ఖన్నా వేదిక మీదికి రాగానే ఆడియన్సంతా వుద్రేకంగా లేచి నిలబడి, కృతజ్ఞతా భావంతో కన్నీటి చుక్కల్ని మెరిపిస్తూ ఆడిటోరియమ్ దద్దరిల్లే చప్పట్లతో స్టాండింగ్ ఒవేషన్ యిచ్చారు. 'కృష్ణలీలలు' చిత్ర

నిర్మాత దర్శకుడైన బాబోయ్ భాయ్‌శాస్త్రికీ, శ్రీకృష్ణపాత్రధారి హీరో హైరభసబాబుకీ, మిగతా యెవ్వరికీ రాని రెస్పాన్సు అసిస్టెంట్ డైరెక్టర్, బాహుబలి ఖన్నాకు వచ్చింది. యాంకరు పిల్ల కన్ఫ్యూజైంది.

బాబోయ్ భాయ్‌శాస్త్రి, తన అసిస్టెంట్ బాహుబలిఖన్నా దగ్గరకు తీసుకుని వాటేసుకుని వీపు తట్టాడు. ప్రేక్షక జనంకేసి తిరిగాడు. ఆ జనం ఆపకుండా నిలబడి అలాగే చప్పట్లు కొడుతున్నారు. బాబోయ్ శాస్త్రివారిని మెల్లగా వారించి, అన్నాడు. 'థాంక్యూ, థాంక్యూ సో మచ్. నా యీ 'కృష్ణలీలలు' చిత్రానికి పనిచేసిన నా అసిస్టెంట్ బాహుబలిఖన్నా యివాళ మీరు చూపే ఆదరాభిమానాలకు యెంతైనా అర్హుడు. ఇతను మా యూనిట్ మొత్తం గర్వించదగిన మనిషి. కాదు మనీషి. ముఖ్యంగా ఆ రోజు షూటింగులో ఆ గోవర్ధన గిరిని అట్టలతో రాళ్లతో తయారు చేసి తాళ్లతో వేలాడదీశాం. అప్పుడొక తాడు తెగి ఆ బరువైన కొండ నేలమీద పడబోయింది. ఆ కొండకింద రేపల్లె గోపజనంగా నటించిన స్త్రీ పురుషులు, పిల్లా పాపలు మీ ఆడియెన్స్‌లో సగం మందికి పైగా వున్నారు. మన హీరో హైరభసబాబు కొండను తన వేలితో తాకుతున్నాడు. ఆ గోవర్ధనం కిందపడి వుంటే ఆర్టిస్టులంతా కృష్ణార్పణం అయిపోయి, మనం యీరోజు యిలా కలిసి పండుగ చేసుకునే పరిస్థితే వుండేదికాదు. అంచేత మన 'కృష్ణలీలలు' చిత్రానికి నిజమైన హీరో కృష్ణుడు యీ బాహుబలి ఖన్నాయే' - అని వివరించాడు.

తర్వాత బాహుబలి ఖన్నా ప్రేక్షకులతో క్లుప్తంగా రెండు మాటలు చెప్పి కూర్చున్నాడు. కృతజ్ఞతా పూర్వకంగా వారి గొప్ప స్పందనకు నమస్కారం కూడా పెట్టలేదు.

- అదీ విషయం విక్రమార్కా! ఇప్పుడు చెప్పు! 'కృష్ణలీలలు' చిత్రనిర్మాణానికి, ఆర్టిస్టులకీ ఆయువు పోసిన బాహుబలి ఖన్నా ఆడియెన్స్‌కి యేం చెప్పాడు? అతనెందుకు నమస్కారం పెట్టలేదు?

- ఈ ప్రశ్నలకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో, నీ మీద గోవర్ధనగిరి పడి నీ తల వెయ్యి ముక్కలు కలిసిన పచ్చడైపోతుంది." అని బేతాళుడు ముగించాడు.

బదులుగా విక్రమార్కుడు, - "ఓ బేతాళా! అసిస్టెంట్ డైరెక్టర్ బాహుబలి ఖన్నా ఆడియన్స్‌తో అన్నమాటలివి. 'నా విధి నేను నిర్వర్తించాను. అంతా ఆ కృష్ణుడి కృప. మీరు చూపే అభిమానానికి ఆనందంతో అశ్రువులు రాల్చడం తప్ప, మీకు నమస్కరించలేకపోతున్నాను. మన్నించండి మిమ్మల్ని షూటింగులో తాడు తెగి కిందికి పడిపోయే కొండను ఆపే ప్రయత్నంలో, కొండ వొక వేపు వొరిగి పోయి నా రెండు చేతుల మీదా పడింది. చేతులు రెండూ పనికిరానంతగా విరిగిపోతే వాటిని హాస్పిటల్లో సర్జరీ చేసి తీసేశారు. నాకిప్పుడు చేతుల్లేవు. అంచేత నా రెండు చేతులూ యెత్తి మీకు మనసారా నమస్కరించలేకపోతున్నాను. మన్నించండి -' అని ముగించాడు.

ఈ సందర్భంలో నటుడు శ్రీ రావికొండలరావుగారు చెప్పిన వొక ప్రసిద్ధ కళాదర్శకుడు వొక ఫంక్షన్‌లో పలికిన మాటలు గుర్తొస్తున్నాయి.

అంతేకాదు, దాదాపు 1938లో సర్‌నికొలాస్ వింటన్ 669 Jewish పిల్లల్ని హోలోకాస్ట్‌కి బలైపోకుండా రక్షించాడు. ఆయన వొక లైవ్ టీవీ షోకి అతిథిగా వెళ్లినప్పుడు ఆడియన్స్ ఆడామగా అంతా కన్నీటి కృతజ్ఞతతో లేచి నిలబడ్డారు. తను యాభైయేళ్లు యెవరికీ చెప్పని రహస్యం యింట్లో అటకమీద తన డైరీలో నిద్రపోతుంటే తన భార్య ఆ డైరీ చూసి ఆ రహస్యాన్ని నిద్రలేపిందన్న సంగతి సర్‌వింటర్‌కి తెలియక ఆ టి.వి.షోనాడు అంతా అలా యెందుకు గౌరవంతో లేచి నిలబడ్డారో అర్థంకాలేదు. అలా నిలబడిన ఆ స్త్రీ పురుషదంపతుల బతికి పెరిగిన పిల్లలంతా సర్‌వింటర్‌గారు హోలోకాస్ట్ నుండి తప్పించి రక్షించిన పిల్లలే.

ఎన్నో జీవాలకు ప్రాణదానం చేసిన 'కృష్ణలీలలు' చిత్రం అసిస్టెంట్ డైరెక్టర్ బాహుబలి ఖన్నా, సర్ నికొలాస్ వింటర్‌లాంటివాడే శ్రీకృష్ణుడు యెలావుంటాడు? అని వేరే అడగాలా?

సుదుర్దర్శ మిదం రూపం

దృష్టవానసి యన్మమ!

దేవా అప్యస్యరూపస్య

నిత్యం దర్శన కాంక్షిణః ||

ఇప్పుడు చూసే నా విశ్వరూపం యింకెవ్వరూ చూడలేరు. దేవతలు యీ రూపం చూడాలని నిత్యం కోరుతూనే వుంటారు - అన్నారోయ్ గీతాచార్యులు, శ్రీకృష్ణభగవానుడు -" - అని చెప్పగానే, బేతాళుడు ఎమోషన్‌తో యెగిరి వెళ్లి మళ్లీ చెట్టెక్కేశాడు.

*(వచ్చేనెలలో మరోకథ)*

Post your comments